TELANGANA
RESOURCE CENTRE

"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

హైదరాబాద్, 13.12.2014:

తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం 'చంద్రం' భవన్‌లో **"పుస్తకాలు–సమాజం–హైద్రాబాద్ పుస్తక ప్రదర్శన 2014"** అనే అంశంపై 152వ చర్చా కార్యక్రమం జరిగింది. ఇందులో వక్తలుగా **తెలుగు విశ్వ విద్యాలయం ఉప కులపతి ప్రొ॥ ఎల్లూరి శివారెడ్డి, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొ॥ వి. కొండలరావు, హైద్రాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు శ్రీ జూలూరు గౌరీశంకర్, వీక్షణం ఎడిటర్ శ్రీ ఎన్. వేణుగోపాల్, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ పత్తిపాక మోహన్, తెలంగాణ విద్యావంతుల వేదిక వైస్ ప్రెసిడెంట్ శ్రీ తిప్పర్తి యాదయ్య, హైదరాబాద్ బుక్ ఫెయిర్ జనరల్ సెక్రటరీ శ్రీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.**

**ఈ సందర్భంగా:**

హైద్రాబాద్ పుస్తక ప్రదర్శన ప్రతి సంవత్సరం హైదరాబాదులో జరుగుతుంది. దీనిని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ నిర్వహిస్తుంది. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ప్రముఖ ప్రచురణకర్తలు, దుకాణదారులు మరియు పంపిణీదారులు కలసి 1987వ సం॥లో ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ముఖ్య ధ్యేయం ప్రజలలో పుస్తకాలపట్ల అవగాహన కలిగించడం.

**మనిషి ఎదుగుదలకు పుస్తకం ఒక తోడ్పాటు.**

**తెలుగు విశ్వ విద్యాలయం ఉప కులపతి ప్రొ॥ ఎల్లూరి శివారెడ్డి :**

పుస్తకం అనేది మన ఎదుట ఉన్న మరో మస్తికం లాంటిది. జీవిత కాలమంతా కృషి చేసి ఒక గ్రంథాన్ని వ్రాస్తారు. దానిని మనం అంతకాలం వ్రాసిన జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. టెక్నికల్‌గా ఎన్ని ఉన్నా పుస్తకం ద్వారానే అన్నీ తెలుస్తాయి. మీడియాలో అన్ని అంశాలు మన దృష్టికి రావు. కానీ పుస్తకంలో సమగ్రంగా ఉంటుంది. అన్ని రంగాలవారికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. దీని వలన హృదయ భావం వైశాల్యం అవుతుంది. మనం ఎదగటానికి పుస్తకం ఒక మెట్టులా ఉంటుంది. తమ జీవిత కాలంలోని అనుభవాలు కొన్ని గంటలలో స్వాధీనమవుతాయి. ఇదొక మంచి అవకాశం. ఈ పుస్తక ప్రదర్శన ద్వారా వారి శ్రమ ఎంతగా ఉంటుందో మనకు అర్థమవుతుంది. పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు.

**సమాజాన్ని నడిపించేది పుస్తకాలే.**

**హైద్రాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు శ్రీ జూలూరు గౌరీశంకర్:**

కాల గతిని మార్చగల శక్తి సామర్థ్యాలు పుస్తకానికే ఉన్నాయని, పుస్తక పఠనం పైన ఎంతమేరకు జాగృతం చేయగలిగితే సమాజం అంత పటిష్ఠవంతంగా తయారవుతుంది. సమాజ పునాదులు పుస్తకాల్లోనే ఉన్నాయి. దేశాలకు విముక్తిని ప్రసాదించిన నాయకులంతా పుస్తకాలు చదివే దేశభక్తులుగా మారారు. డిజిటల్ యుగంలో కూడా పుస్తకానిదే పెద్ద పీట. డిజిటల్ యుగానికి పునాది కూడా పుస్తకమే వేసింది. నిస్తేజంగా ఉన్న సమాజానికి చైతన్యం కలిగించాలంటే అందుకు పుస్తకమే పదునైన ఆయుధం. సమాజంలో సర్వ రంగాలను శాసించగల, నడిపించగల శక్తి సామర్థ్యాలు పుస్తకానికే ఉన్నాయి. వచ్చే సంవత్సరం సంవత్సరం హైదరాబాద్ ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ నిర్వహిస్తామని తెలిపారు.

**పుస్తకాన్ని పాఠకుడి దగ్గరకు తీసుకువెళ్ళాలి.**

**వీక్షణం ఎడిటర్ శ్రీ ఎన్. వేణుగోపాల్:**

తెలుగు సమాజంలో పుస్తకాభిమానులకు, పుస్తక పాఠకులకు కొదవ లేదు. ప్రచురణకర్తలకు కూడా కొదవ లేదు. కావలసినదల్లా ఈ రెండు వర్గాల మధ్య సంబంధం సమన్వయం. తెలంగాణ పది జిల్లాలోను మూడు జిల్లా కేంద్రాలలో కూడా ప్రధానమైన పుస్తకాల దుకాణాలు లేవు. ఇక మండల కేంద్రాల సంగతి, చిన్న పట్టణాల సంగతి చెప్పనక్కరలేదు. అందువలన ఇవాళ తెలంగాణ సమాజంలో పుస్తకాన్ని పాఠకుల దగ్గరికి తీసుకుపోవడమే ప్రధానమైన కర్తవ్యం. బుక్‌ఫెయిర్ వంటి ప్రయత్నాలు ఆ కృషిలోభాగం. ఇవి కేవలం హైదరాబాద్‌లో మాత్రమే కాకుండా కనీసం జిల్లా కేంద్రాలన్నింటిలో

TELANGANA
RESOURCE CENTRE
"CHANDRAM" 490, St.No.11, Himayatnagar, Hyderabad-29 Mobile: 9030626288
E-mail: trchyd@gmail.com Website: www.trchyd.org

నిర్వహించడానికి అవకాశాలు అన్వేషించాలి.

**నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ పత్తిపాక మోహన్:**

దేశవ్యాప్తంగా పుస్తక వికాసానికి పుస్తక మేళా కేంద్రంగా చేసుందాం. 1972లో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా ని ప్రతి సామాన్యుడికి అందుబాటులో పుస్తకం ఉండాలని ఏర్పాటు చేశారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తే అన్ని ప్రాంతాలలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తామని, వారికి ఆర్థిక రూపంలో గ్రాంటింగ్ ఎయిడ్ రూపంలో సమకూరుస్తామని తెలిపారు.

**తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొ॥ వి. కొండలరావు:**

భాష రానిదే ప్రజ్ఞ రాదు. చదువు రావాలంటే చదవ రావాలి. చదవరావాలంటే భాష రావాలి. భాష రానిదే పుస్తకాలు చదవలేరు. ఏ భాష విద్యామాధ్యమంగా గుర్తించబడదో ఆ భాష 15 సం॥లలో కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఆంగ్లభాషపై మోజుతో మన నిర్లక్ష్యం కారణంగా నేడు తెలుగు మాట్లాడటం, వ్రాయటం అంతరించిపోతోంది. పిల్లలో మాతృభాషపై మక్కువ పెంచడానికి పుస్తక పఠనం తోడ్పడుతుంది. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలి.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ శ్రీ ఎం. వేదకుమార్, శ్రీ సిహెచ్ రాజేశ్వరరావు, శ్రీ దేవీప్రశాద్, శ్రీ దొంతి నర్సింహారెడ్డి, శ్రీ సుభాష్, శ్రీ రాజేందర్, శ్రీ అశోక్ మునికుట్ల, ప్రొ॥ జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ రిసోర్స్ సెంటర్**